# ఆకలి!

వర్షం సన్నగా ఆగకుండా కురుస్తూనే వుంది. దీపస్థంభాల వెలుగు, చీకట్లో మిణుగురుల్లా వున్నాయి ఆ వీధిలో ఆవులమందలో (ఆవులమంద సికింద్రాబాద్‌లోని ఒక వీధిపేరు). ఆ రోజుల్లో అక్కడున్నది ఒకే ఒక్కమేడ. ఆ మేడ పక్కనవన్నీ చిన్నా పెద్దా సైజుల్లో వున్నవి పెంకుటిళ్ళే. ఆ ఇల్లు మరీను. దాని వయసు కనీసం ప్లాటినం జూబ్లీ దాటుంటుంది. ఆ ఇంటి ఓనరు పెంటయ్య రెణ్ణెళ్ళకొకసారి పెంచే అద్దె కట్టుకోవడం కష్టమే కనుక ఆ యిల్లు ఏడాదిలో సగం రోజులు ఖాళీగానే వుంటుంది. ఇటీవలే ఒచ్చిందొక కుటుంబం ఆ ఇంటికి, పదిమంది పిల్లలతో బిలబిలమంటూ. చెప్పానుగా ఆ వీధిలో వున్నది ఒకే ఒక్క మేడ అని. అది మాదే మా తాతగారు కట్టిన ఇల్లది. ఆ ఇంటికి కాస్త సున్నం వేయించడానికే మానాన్నకి శక్తి సరిపోయేది కాదు. ఆయన సికింద్రాబాద్‌లోనే ఒక ప్రభుత్వ పాఠశాలలో లెక్కల మాస్టారుగా చేసి రిటైరయ్యారు. మా ఇంట్లోమేము అయిదుగురం. మానాన్న సంపాదన మీద ఆధారపడి వుండేవాళ్ళం.

నాకు ముగ్గురక్కయ్యలు. మగపిల్లవాడు లేకపోతే పున్నామనరకం తప్పదనేమో నాలుగవ సంతానం కూడా ప్రయత్నిస్తే నేను పుట్టాను. నాన్న జీతం మా చదువులకీ, అక్కయ్యల పెళ్ళిళ్ళు, ఆయన రిటైరయ్యాక రాబోయే గ్రాట్యుటీకి ముందే చేసిన అప్పులకి అయిపోయింది. కాకపోతే లెక్కల మాస్టారవడంవల్ల కాస్త ప్రైవేట్ ట్యూషన్ల రాబడి సంసారంలో వేన్నీళ్ళకి చన్నీళ్ళుగా తోడ్పడింది. నేను బి.కాం. పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. మా ఇంట్లో డాబామీద ఒకే ఒక గదుంది. అది నా గదే! నా గది కిటికీలోంచి చూస్తే పెంటయ్యగారి పెంకుటిల్లు కనిపిస్తుంది. అది పాతరకం ఇల్లు కదా! లోపల ఒక మండువా. అక్కడే నీళ్ళ పంపు, గిన్నెలు కడుక్కోవడానికి మోరీ వున్నాయి. మిగిలిన మూడువైపులా ఒకవైపున వంట యిల్లు, మరో రెండువైపులా గదులూ మరోవైపు ఖాళీగోడా వున్నాయి. ఇంచుమించు ఇల్లంతా ముఖ్యంగా మండువా కనిపిస్తుంది నా గదిలోనుంచి.

ఆ ఇంట్లో దిగిన వాళ్ళకి మా కిటికీ చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అందుకే చాలా మటుకు ఆ తలుపులు తియ్యను నేను. అయితే అప్పుడప్పుడు తోచకపోతే తలుపు సందుల్లోంచి కిందకి చూస్తూ వుంటాను. అందులోనూ ఇప్పుడు పదిమంది పిల్లల అలికిడి నాకు చాలా కాలక్షేపంగా వుంది. చిన్న పిల్లల ఆటలూ పోట్లాటలు, పెద్దవాళ్ళ మాటలూ చేష్టలూ అన్నీ నాకు సినిమా చూస్తున్నట్లుగా వుండేది ఆ కిటికీ సందుల్లోంచి చూస్తుంటే.

అయితే ఎవ్వరి మొహాలూ స్పష్టంగా చూళ్ళేదు ఇంతవరకూ. అందరిలోకీ పెద్దది ఆడపిల్ల. పధ్నాలుగేళ్ళుంటాయేమో! అందంగా అమాయకంగా, అల్లరిగా అప్పుడప్పుడు వోణీ సర్దుకుంటూ హుందాగా అనిపించేది. నాకు తెలీకుండానే నేను ఆ అమ్మాయిని చూడాలని కోరుకునేవాణ్ణి. బహుశః నా పాతికేళ్ళ వయసు అట్లాంటిదేమో! ఆ అమ్మాయి కన్నా అందరూ చిన్నవాళ్ళే. వాళ్ళమ్మగారి చేతిలో ఎప్పుడూ ఆ చివరి సంతానం వుండేది. ఈ అమ్మాయి తల్లికి అన్ని పనుల్లోనూ సాయం చేస్తూనే కనబడేది. ఆ అమ్మాయి పేరు తెలీదు. స్ఫురద్రూపి కనుక, రూప అనుకుందాం.

అప్పుడప్పుడూ మోరీ దగ్గర గిన్నెలు తోముతూ, బియ్యం కడుగుతూ, ఆ మండువాలో కూర్చుని కూరలు తరుగుతూ కనబడేది. మరోసారి ఏవో పత్రికలు తిరగేస్తూ కనబడేది. ఒక్కోసారి హోంవర్క్ (ఆ మండువాలో నేలమీద చాపేసి కూర్చుని) చేసుకుంటూ కనబడేది. అప్పుడప్పుడు ఏవో పాటలు పాడుతూ, దువ్విన తలనే దువ్వుకుంటూ వోణీని సవరించుకుంటూ లేడిపిల్లలా ఛెంగుఛెంగున ఎగిరి గంతులేస్తున్నట్టు కనిపించేది. ఒక్కొక్కసారి, దిగాలుపడి కనిపించేది. ఇదంతా దూరం నుంచి చూస్తున్న మసక మసకగా కనిపించే చిత్రమే నాకు. వాన వెలిసింది. రాత్రి పదవుతోంది. రేడియో కట్టేసి నిద్రలోకి జారుకున్నాను మెల్లగా. వానతో తడిసిన గాలి వింజామర్లా వీచుతూవుంటే!

* * *

ఒకరోజు పొద్దుటే ఇంట్లోంచి అరుపులూ, కేకలూ వినబడ్డాయ్. కిటికీ తలుపు కొంచెం తెరిచి చూశాను. అద్దెకోసం పెంటయ్య నానామాటలూ అంటున్నాడు. ఆ ఇంటాయన లోపలున్నాడేమో బయట కనిపించలేదు. ఆ ఇల్లాలు ఏదో చెప్తోంది. కానీ, పెంటయ్య వినిపించుకోవడంలేదు. రూప కూడా ఏదో సర్ది చెప్పబోతోంది ఆరిందాలాగా. కానీ, పెంటయ్యగారు ఒక్క కసురు కసిరాడు ఆ పిల్లకేసి చూస్తూ. దాంతో ఆ అమ్మాయి బిక్కచచ్చినట్టు గోడకతుక్కుపోయింది. పెంటయ్య అరిచీ అరిచీ అరగంటసేపు మళ్ళా వస్తానంటూ వెళ్ళిపోయాడు. అంత పెద్దగా అరవడం వల్ల అతని మాటలన్నీ వినబడ్డాయి నాకు. వాళ్ళు నాలుగు నెలల అద్దె బాకీ అట. నాలుగు రోజుల్లో ఇవ్వకపోతే సామాను బయట పారేస్తానన్నాడు. వాడు వెళ్ళిపోయినా, ఆ కుటుంబం గురించి ఆలోచనలు నా మెదడులోంచి పోలేదు. ఎందుకో! వాళ్ళ నాదుకోవాలనే ఆరాటం. కానీ, ఎలా? నాకే ఉద్యోగం లేదు. నేనెలా ఆదుకుంటాను? ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు, మనసు చుట్టూ కందిరీగల్లా ముసురుకుపోయాయి.

ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకి నాకు పౌరసరఫరాల ఆఫీసుకెళ్ళి అప్లికేషన్ తెచ్చుకోవలసిన పనుంది. నేను బయటికొస్తుంటే ఆ ఇంట్లోంచి బయటికొస్తున్న మనుషులు కనిపించారు. నలుగురబ్బాయిలు బస్తాడు పుస్తకాలు వెనకేసుకొని బడికెళ్తూ.

'ఏ స్కూలు?' అడిగాను.

'మహబూబ్ కాలేజీ' అన్నారు అందరూ ఏకగ్రీవంగా.

'ఏ క్లాసు?'

మొదటివాడు ఎనిమిది, తరువాత ఆరు, అయిదు, నాలుగు' అన్న కంఠాలు వినిపించాయి. వెనక వచ్చింది రూప. ఒక చెల్లాయినీ, ఒక తమ్ముణ్ణీ చేతులు పట్టుకొని.

ఆ రోజుల్లో ఫ్యామిలీ ప్లానింగ్ గురించి చాలామందికి తెలీదు. కానీ తెలివైనవాళ్ళు డాక్టరునడిగి కుటుంబాన్ని పరిమితం చేసుకునేవారు.

రూప తమ్ముడూ, చెల్లెలి చేతిలో విరిగిపోయిన పలకలు, చిన్న బలపాలూ వున్నాయి.

'మీ పేరేమిటీ.' అని ఆమె నడగలేకపోయాను.

'ఏ బడికెళుతున్నారు?' అడిగాను రూప చెల్లెలి బుగ్గపై చిటికవేస్తూ.

'ఈ పక్కనే వున్న సాయి స్కూలు' అంది ఆ చిన్నారి కళ్ళు తిప్పుకుంటూ.

'సాయి స్కూలు' అని మా ఇంటికి నాలుగిళ్ళ అవతల ఒకావిడ పెట్టింది. అదొక వీధిబడి. ఆ పెట్టినావిడ బహుశః అయిదారు క్లాసులకన్నా చదువుకొని వుండదు. ఫీజు నెలకి మూడు రూపాయలట. మా పనిమనిషి కొడుకు రామిగాడు అక్కడే వెళ్తాడని పనిమనిషి లక్ష్మి అమ్మతో చెప్తుంటే విన్నాను. ఈ పిల్లలు అక్కడికి వెళుతున్నారంటే వాళ్ళ ఆర్థిక పరిస్థితి అర్థమైపోయింది. ఆ అమ్మాయి రూప గబగబా వాళ్ళను స్కూల్లో దింపి తనూ వెళ్ళిపోయింది.

'ఆ అమ్మాయి ఏ స్కూల్?' అడగాలనిపించింది. ధైర్యం చాలలేదు. గబగబ నడచి వెళ్ళి బస్టాండ్ చేరుకున్నాను. పాట్నీ సెంటర్ దగ్గర ఆబిడ్స్ కెళ్ళే బస్సెక్కాను.

శ్రావణమాస ముసుర్లేమో? వాన వెలిసి రెండ్రోజులన్నా కాలేదు. మళ్ళీ ఒకటే కుంభవర్షం. 'కింగ్స్‌వే' (అంటే ఇప్పుడు రాష్ట్రపతి రోడ్డు అని పిలవబడుతున్న రోడ్డు) రోడ్ కిరువైపులా ఉన్న గుల్‌మహార్‌చెట్లు (వీటినే కొందరు అగ్నిపూలని కూడా అంటారు).

ఆ రోజు గొడుగు తీసుకెళ్ళకపోవడంతో వానలో తడిసి ముద్దయిపోయాను.

మరో రెండడుగులు వేశానో లేదో వర్షం మరీ పెద్దదైపోయింది. గత్యంతరం లేక అక్కడ ఒక ఇంటి వరండాలో వెళ్ళి తలదాచుకున్నాను. మొహాన పడ్డ నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

మళ్ళీ కర్చీఫ్‌ను జేబులో పెడుతూ తిరిగి చూసేసరికి నా ముందు నుంచున్నది రూప. పమిటచెంగుతో మొహానవున్న నీటిని తుడుచుకుంటూ. ఆమె ముఖంమీద తిలకం బొట్టు చెరిగి నీళ్ళలో కరిగి ఎర్రటిధారగా ముక్కుమీంచి జారుతోంది. ఆమె నాకేసి చూసింది. గుర్తుపట్టినట్టు చిరునవ్వు నవ్వీనవ్వనట్టు చూసింది.

వెంటనే ధైర్యాన్నంతా కూడగట్టుకొని, 'మీరూ బాగా తడిసిపోయారే? వాన బాగా పెద్దగా వచ్చింది' అన్నాను.

'అవును' అంది ముక్తసరిగా.

నాకింకేం మాట్లాడాలో తెలీలేదు. రెండు క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

'ఇవ్వాళ లేటయిందా?' ఏదో ఒకటి మాట్లాడాలని పిచ్చి ప్రశ్న వేశాను.

'అవును. ఇవ్వాళ మా స్కూల్లో స్పోర్ట్స్ డే... ఫంక్షన్ పూర్తయిందో లేదో వాన పట్టుకుంది' అంది.

ఆ కంఠం మోహనరాగంలా అనిపించింది. ఆమె పలికే అక్షరాలు పంచదార చిలకల్లా అనిపించాయి. ఇక ధైర్యం తెచ్చుకొని మాట్లాడడానికి ప్రయత్నించాను.

' ఏస్కూలు?'

'కీస్.. గర్ల్స్ .. హైస్కూలు...'

'ఏక్లాసు?'

నైన్త్...'

మళ్ళీ నిశ్శబ్దం. తన పేరడగాలని అనుకున్నాను. బాగుండదేమోనని 'నా పేరు శరత్' అన్నాను, తన పేరు కూడా చెబుతుందేమోనని.

'తెలుసు' అని ఊరుకుంది.

ఆశ్చర్యంగా 'ఎలా తెలుసు?' అడిగాను.

'ఒకసారి మీ అమ్మగారు ఏదో మాటల్లో మా అమ్మగారితో చెబుతూ వుంటే విన్నాను' అంది.

ఆ అమ్మాయి ధైర్యంగా చక్కగా అలా మాట్లాడుతూంటే నేను నంగిగా మూగిలా ఉండడం నామీద నాకే కోపమొచ్చింది. ధైర్యంచేసి 'మీ పేరేమిటి.' అడిగాను.

'వర్షిణి' అంది.

'అదీ అందుకే వర్షంలో తడిసి ముద్దయ్యారు. వర్షిణి ఎంత మంచిపేరు. అమ్మా వర్షిణీ... ఈ వానని కాస్త ఆపకూడదూ?' రెండు చేతులూ జోడించి దండం పెడుతున్నట్టుగా ఆమెకేసి చూస్తూ అన్నాను.

ఆమె పకపకా నవ్వింది.

ఆ నవ్వులో నందివర్ధనాలు పూశాయి!

సెలయేరులు గలగలా పారేయి!

తన్మయత్వంతో ఆమెకేసి చూశాను. ఆమె ఆకాశానికేసి చూస్తోంది.

'వర్షం తగ్గుతున్నట్టుంది' అంది.

'అవును. సన్నగా. తుంపరలు పడుతున్నాయంతే' అన్నాను.

'ఇక వెళ్ళచ్చేమో' అంది చెయ్యిచాచి అరచేతిలో చినుకులు ఎంత తీవ్రంగా వస్తున్నాయో పరికిస్తూ వర్షిణి.

'పదండి' అంటూ ఆమె అడుగులో అడుగులేస్తూ ఏదో అవ్యక్తమైన గజిబిజి ఊహల ఆనందపు డోలికలో ఊగుతూ సాగిపోతున్నట్టు వింత అనుభూతుల అల్లికతో తేలిపోతూ వెనకే నడిచాను.

ఆ రాత్రి నాపాలిట శివరాత్రే అయింది. వర్షిణి... రూపం, వర్షిణి మాటలూ సర్వం వర్షిణిగా మనసు నిండిపోయింది. జరిగినదంతా మళ్ళీ మళ్ళీ తలుచుకుంటూ ఏ నడిరేయి ఝామునో కళ్ళు మూశా నిద్రాదేవిని ఆహ్వానిస్తూ.

* * *

ఆ రోజు సాయంత్రం దాదాపు నాలుగు గంటలు కావస్తోంది. ఎంప్లాయిమెంటు ఆఫీసుకెళ్ళి ఒక ప్రదక్షిణ చేసి అప్పుడే ఇల్లు చేరుకుంటున్నాను. వర్షిణీ వాళ్ళ ఇంటి తలుపులు తెరిచి వున్నాయి. లోపలనుంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి. సభ్యత కాదని తెలిసి కూడా మెల్లగా తొంగి చూశాను.

రాజయ్య... రాజయ్య ఎవరంటే ప్రతీరోజూ సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి, ఇడ్లీలూ, పచ్చడి, వడా, వంకాయ లేదా మిర్చీ బజ్జీలు వేడివేడిగా చేసి తీసుకొచ్చి అమ్ముతుంటాడు. ప్రతీవాళ్ళూ కొంటారు వాడి దగ్గర. ఎప్పుడోగానీ అతడు తను తెచ్చిన గిన్నెను నిండుగా తీసుకెళ్ళడు, ఖాళీ చేసి తప్ప. 'అన్నపూర్ణుడు' అనచ్చేమో. వర్షిణి వాళ్ళింటికి కూడా తరచు వెళుతుంటాడు. ఆ రోజున జరిగిందేమిటంటే, నేను జన్మలో మర్చిపోలేని సంఘటన! భగవద్గీత నాకు జీవితాన్ని గురించి ఉపదేశించిన సంఘటన!

'నేనియ్యాల ఒక్క రూపాయి కూడా అప్పియ్యనమ్మా... నా పైసలు, అదివరకటి బాకీ నా మొఖానబడెయ్యి. ఇయ్యన్ని అమ్ముకొని ఇంటికి బోవాల' ఖచ్చితంగా చెప్తున్నాడు వాడు.

'బాబూ... ఇవ్వాళ పిల్లలు పొద్దుటి నుంచీ ఏమీ తినలేదు. నీకు పుణ్యముంటుంది. పచ్చిమంచినీళ్ళు తాగి స్కూలుకెళ్ళారు. ఆకలిమీదున్నారు. నీ డబ్బులెక్కడికీ పోవు. రెండు మూడు రోజుల్లో నీ బాకీ మొత్తం ఇచ్చేస్తాను' ఆమె మరీ మరీ బతిమాలుతోంది దీనంగా.

'లేదమ్మా... నేనియ్యాల ఉద్దెరియ్యను. ఉద్దెరిస్తే ఇయ్యన్నీ మీరే దినేటట్టున్నారు! గిన్నె ఖాళీచేసి సేతులూపుకుంటూ ఇంటికిపోతే రేపేం బెట్టి మల్ల ఇయ్యన్నీ తయ్యారు జెయ్యాల? నీకాలు మొక్కుత! నా పాతబాకీ కూడా బడెయ్' వాడు గట్టిగా మరింత ఖచ్చితంగా చెప్తున్నాడు.

ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది కాబోలు. మాట్లాడలేకపోతోంది. గుండె గొంతుకడ్డుపడ్డట్టు క్షణం ఆగింది. 'రాజయ్యా... పోనీ, మాకిచ్చాక మిగిలినవి అట్లు తిరిగి అమ్ముకురా... ఈలోగా అయ్యగారొస్తే నీ డబ్బులు నీకిప్పిస్తాను' అంది ప్రాధేయపడ్తున్నట్టుగా.

రాజయ్య విసుక్కుంటూ 'ఏమేం కావాలో జెప్పండ్రి' అన్నాడు గిన్నె మూతదీస్తూ.

అందరూ ఆ గిన్నెకేసి చూస్తున్నారు ఆత్రుతగా.

'ముందు అందరికీ రెండేసి ఇడ్లీలు పెట్టు' అంది ఆమె.

వాడు బాదం ఆకులు తీసి రెండేసి ఇడ్లీలు, చట్నీవేసి ఇస్తూవుంటే, వర్షిణితో సహా ఒక్కొక్కళ్ళే వచ్చి తీసుకుని ఆవురావురుమని తింటున్నారు. ఆమెకూడా పిల్లలతోపాటు ఆత్రంగా తినడం చూస్తే నా గుండె తరుక్కుపోయింది. రెండు ఇడ్లీలూ రెండు క్షణాల్లో తినేశారు. 'ఇప్పుడేం గావాలా?' రాజయ్య గొంతు.

ఒకరు వడ, ఒకరు వంకాయ బజ్జీ... ఇలా అందరూ ఏవే ఏవో ఎవరిక్కావలసినవి వాళ్ళు తిన్నారు లొట్టలేసుకుంటూ. 'ఆకలి రుచెరుగదు' అంటారు. అది అక్షరాలా నిజం. ఆ

క్షణంలో వారికేమిచ్చినా మాకొద్దు... మా కివ్వే కావాలి అన్నంత ఆబగా తిని హాయిగా నీళ్ళు తాగి త్రేన్పడం చూస్తే.

నా గుండెని ఎవరో కత్తితో కోసినట్టనిపించింది. ఎన్నిసార్లు నేను నాకు తెలీకుండా ఆకలి లేదంటూ సగం టిఫిను వదిలేసి ప్లేటులో చెయ్యి కడుక్కుని వెళ్ళానో తలచుకుంటే సిగ్గేసింది. కొంచెం వంగి ఇంట్లోకి చూశాను. ఇల్లాలి మొహం చూసేసరికి, ఏదో జ్ఞాపకం మనసులో లీలగా మెదిలింది. ఆలోచిస్తూనే నుంచున్న నేను రాజయ్య బయటికి రావడం చూసి కాస్త పక్కకు జరిగి 'రాజయ్యా' అని పిలిచాను. వాడు, 'అయ్యా!' అంటూ ఆశగా వచ్చాడు క్షణంలో. 'వాళ్ళు ఎంత డబ్బివ్వాలి?' అడిగాను.

'ఇయ్యాల ఇరవైరెండు, నిన్న పద్దెనిమిది, మొన్నటియి పన్నెండు మొత్తం యాభైరెండు' అన్నాడు మరోసారి లెక్కలు చూసుకుంటూ. వెంటనే జేబులోంచి డబ్బులు తీసి యాభైరెండు రూపాయలూ రాజయ్య చేతిలో పెట్టి, 'తీసుకో వాళ్ళబాకీ, ఇంక వాళ్ళని డబ్బులడగకు' అన్నాను.

వాడు నాకేసి ఆశ్చర్యంగా చూశాడు. 'నేను వాళ్ళకి డబ్బివ్వాలిలే. నేనూ వాళ్ళూ లెక్కలు తరువాత చూసుకుంటాం గానీ, ఈ సారి నుంచి వాళ్ళతో డబ్బు దగ్గర పేచీ పడకు' చెప్పాను. వాడు నావైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ దండంపెట్టి, 'మీకేం వద్దా దొరా?' అడిగాడు.

'ఒద్దు రాజయ్యా... ఇప్పుడే వస్తూ వస్తూ ఆకలిగా అనిపిస్తే ఆనంద్‌భవన్‌లో టిఫిన్ చేసి వస్తున్నా' అన్నాను.

'కొలువు దొరికిందా దొరా?' అడిగాడు.

'లేదు రాజయ్యా.. ఇంకా లేదు' అన్నాను.

బాధపడుతూ 'మాలాంటోళ్ళని సూసి మీకు సదువుల్లేవు. అందుకే ఏ కొలువుకు పనికిరారు అనేవోరు. మరిప్పుడు సదువుకున్నా కొలువుల్లేవంటున్నారు. ఈ లోకంలో ఏందో తెలుస్తులేదు' అన్నాడు తత్వవేత్తలాగా, గిన్నె తలపైన పెట్టుకుంటూ.

పోతూ పోతూ నావైపు తిరిగి 'బాబూ! ఆ ఇంటోల్లని సూత్తావుంటే గోసనిపిస్తంది. ఇంట్లో వంట సేసుకున్నట్టు కనబడరు దొరా... పిల్లలా పుట్టెడుమంది. అందరూ బుద్ధిమంతులే. తిన్నా తినకున్నా పుస్తకాలు దీసుకొని ఎప్పుడు సూసినా సదువుకుంటూ కండ్లబడతరు. ఆ పెద్దబిడ్డ ఆడపిల్లలైనా మొగోడితో సమానం. అన్ని పన్లు జేస్తది. బజారుపన్లు, తల్లికి సాయం

అన్ని జేస్తది. ఆ తల్లి సత్తెకాలపు మనిషి. కడుపునిండ కనుకున్నది గాని లోకం దెలవదు. అందుకనె ఎన్నడు ఆల్లకి ఉద్దెరియ్యనని అనను. కాకుంటే జర బెదిరిస్త అంతే' అన్నాడు రాజయ్య నవ్వుతూ.

నాకు రాజయ్య మాటలు వింటుంటే, అతని పరిశీలనా శక్తికీ, అతని సహృదయతకీ మనసు ఉప్పొంగిపోయింది. గొప్ప మేధావి, మహర్షిలా అనిపించాడు.

'నువ్వు చాలా మంచివాడివి రాజయ్యా...' అన్నాను అప్రయత్నంగా.

'బాబూ మీరు మాత్రం? మా మాటలిన్నారు. ఆల్లమీద జాలిబడి, మీరు ఆల్లకి బాకీ ఉన్నారని సెప్పి, ఈ డబ్బులు నాకిచ్చి నన్నూ ఆదుకున్నారు. ఆల్లనీ ఆదుకున్నారు. నాకు తెల్వదా ఏంటి? లేకపోతే మీరు ఆల్లదగ్గర డబ్బులు తీసుకోవడమేంది? మీది బంగారంలాంటి మనసు. భగవంతుడు జల్ది మీకు కొలువిప్పియ్యాల' అని ఆశీర్వదిస్తూ వెళ్ళిపోయాడు. నేను ఆశ్చర్యంలో నుంచి కోలుకునే లోపలే.

'రాజయ్యలాంటి వాళ్ళకి చదువూ డబ్బూ వుంటే, బంగారానికి మెరుగు పూసినట్టుండదూ? ఇలాంటివాళ్ళు రాజకీయాల్లో వుంటే ఎంతమందికి ఉపయోగపడతారో? దేశం ఎంత బాగుపడుతుందో? అనుకుంటూ నాలో నేను నవ్వుకున్నాను. ఎందుకంటే ఇటువంటి వాళ్ళు రాజకీయాల్లోకి ఎలా వస్తారు? వచ్చినా బతగ్గలరా? ఒద్దు.. రాజయ్యలాంటివాళ్ళు ఇలా వుంటేనే పదిమందికి పనికొచ్చే పన్లు చెయ్యగలుగుతారు.' అనుకుంటూ నా పిచ్చి పిచ్చి ఊహలని అదుపులో పెట్టి, మా ఇంటి గుమ్మం చేరుకున్నాను. నా గదిలోకెళ్ళి చెప్పులు మార్చుకొని వెంటనే కిటికీలోంచి కిందికి చూశాను. ఇల్లాలు తృప్తిగా ఒళ్ళో వున్న బాబుతో, ఏవో కబుర్లు చెబుతూ ఆడిస్తోంది. తల్లి ప్రేమంటే ఇదే... బిడ్డల ఆకలి తీరిందనగానే, కాస్త తనూ ఆత్మారాముణ్ణి శాంతింపజేసి, ప్రపంచాన్ని జయించినంత తృప్తిగా, పొత్తిళ్ళలోని బాబుతో ఆడుకుంటోంది. ఆమెకి ఆ ఇల్లే స్వర్గం... పిల్లలే దేముళ్ళు. అంతకంటే కోవెల మరొకటుందా? ఆమెకేసి తదేకంగా చూశాను... మళ్ళీ మళ్ళీ చూశాను. పావలా కాసంత బొట్టు, ఒక్క పసుపుతాడు తప్ప ఏ ఆభరణాలూ లేని బోసిమెడ, చేతులకి మట్టిగాజులూ, మామూలు చీర... అయినా ఆమె మొహంలో ఏదో కళ... ఆలోచిస్తున్న నాకు... ఠక్కున ఏదో గుర్తొచ్చింది. మనసు ఆవేశంగా ఆలోచించడం మొదలుపెట్టింది. సరిగ్గా పన్నెండేళ్ళ క్రితం...

* * *

బోయినపల్లిలో ఒక పెద్ద యిల్లు. ఇంటికన్నా పెద్దతోట. ఆ తోటనిండా, క్రోటన్సూ, పూలచెట్లు, పళ్ళచెట్లు, కూరగాయల చెట్లు, ఒక చిన్న పబ్లిక్‌గార్డెన్లా వుండేది. ఆ తోట చూడ్డానికో గంటపట్టేది. ఆ ఇంటికి వెళ్ళినవాళ్ళకి. ఇక ఆ యిల్లు ఆ రోజుల్లోనే అద్దాల అలమారలు, అద్దాల కిటికీలు, రంగురంగుల్లో ఆకర్షణీయంగా వుండేవి. పెద్ద పెద్ద గదులూ, గదులకు తగ్గ రోజ్‌వుడ్ ఫర్నిచరూ ఆ ఇల్లు చూడగానే 'ఎవరో? ఆగర్భ శ్రీమంతుల ఇల్లు' అనిపిస్తుంది ఎవరికైనా.

ఆ ఇంట్లో వుండేవారు ఆనందరావుగారు. ఒకసారి నాన్నగారికెందుకో అర్జంటుగా వెయ్యిరూపాయలు కావలసి వచ్చాయి. ఆ... మూడో అక్కయ్య సారిక పెళ్ళిలో. నాన్నగారు నన్ను ఆనందరావుగారింటికి పంపించారు. అది మధ్యాహ్న సమయం. ఒంటిగంట కావొస్తూంది. ఆనందరావుగారూ అతని బావమరిది (రఘునాథ్ అని పరిచయం చేసారు అక్కడే వుండి చదువుకుంటున్నాట్ట) పిల్లలు (ఒకరిద్దరే వున్నారు అప్పుడు) ఇంకా ఎవరెవరో బంధువులూ అందరూ భోజనానికి కూర్చున్నారు. లోపల వంట చేస్తున్నది ఆనందరావుగారి అత్తగారు. భార్య సౌభాగ్యమ్మ వడ్డిస్తోంది. నన్ను చూడగానే ఆనందరావుగారు 'శరత్... రా.. రా... భోం చేద్దువుగాని' అన్నారు.

'ఒద్దండీ' అన్నాను.

ఫరవాలేదు రావోయ్... సౌభాగ్యం... శరత్‌కి కూడా కంచం పెట్టి వడ్డించు' అన్నారు.

నేను భోజనం చేసి వచ్చానండి' అన్నాను సిగ్గుపడుతూ.

'శరత్... ఇవ్వాళ మా యింట్లో మెనూ ఏమిటో తెలుసా? నేతిగారెలూ, అల్లం పచ్చడి, పనసపొట్టుకూరా... ములక్కాడ సాంబారూ... మా అత్తగారు స్వయంగా చేసిన చంద్రకాంతలు, చంద్రకాంతలెప్పుడైనా తిన్నావా? చాలా బాగుంటాయి.. రా...' అంటూండగానే సౌభాగ్యమ్మగారు పీటవెయ్యడం, పళ్ళెం పెట్టడం, వడ్డించడం అన్నీ అయిపోయాయి. పీటమీద నాలుగువైపులా చిన్న చిన్న వెండిపూలు అతికించినట్టున్నాయి. వెండికంచం, వెండిగ్లాసు, కంచంలో పదార్థాలూ అన్నీ ఆకర్షణీయంగా వుండడమేకాక, నోరూరించే సువాసనలు గుప్పుమంటున్నాయి. కొసరి కొసరి సౌభాగ్యమ్మగారు వడ్డిస్తూ ఉంటే నాకు తెలీకుండానే నేను పొట్ట పగిలేంత తినేశాను. భోజనాలయ్యాక ఆనందరావుగారు డబ్బిచ్చారు. సౌభాగ్యమ్మగారు వడ్డిస్తూంటే సాక్షాత్తూ లక్ష్మీదేవి పాలసముద్రం మధ్యలోనుంచి వచ్చి, అమృతం వడ్డిస్తున్న మోహినిలా అనిపించింది. రెండు చేతులకీ సగం మోచేతివరకూ ధగధగా మెరిసే గాజులూ, మెడనిండా గొలుసులూ,

నడుంకి వడ్డాణం, సొగసైనరూపం, రూపానికి తగ్గ ఆప్యాయత ఆమెకి మరో ఆభరణంలా అనిపించింది. ఆమె పక్కన ఆనందరావుగారు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిలా అనిపించారు. బహుశః వర్షిణే కావచ్చు. రెండు మూడేళ్ళపిల్ల. బొద్దుగా, తెల్లగా వుంది. బాగా జ్ఞాపకం ఎర్రటి పూలగౌను వేసుకొని, కాళ్ళకి గజ్జెలు, చెవులకి లోలక్కులూ, గలగలా మాట్లాడుతూ ఏవో కబుర్లు చెబుతూ వాళ్ళ నాన్నని అంటిపెట్టుకునే వుంది! ఏమిటి? ఎందుకింత మార్పు? అటువంటి ఆనందరావుగారెందుకింత దరిద్రంలో వున్నారు? నాన్నగారుంటే తెలిసేది. అమ్మకేమీ తెలీదు' అనుకుంటూనే అమ్మనడిగాను.

'అమ్మా! పెంటయ్య ఇంట్లో అద్దెకున్నవాళ్ళు ఆనందరావుగారేనా?' అని. 'అవును బాబూ! వ్యాపారంలో మోసం చేశారు, స్నేహితులుగా వున్న కొందరు. దాంతో ఆనందరావుగారు వ్యాపారం చెయ్యడం మానేశారు. సంపాదన పోయింది. సంసారం పెరిగింది. అతనికింద పనిచేసిన గుమాస్తాలే శ్రీమంతులైపోయారు.'

'ఇప్పుడాయన ఏం చేస్తున్నారు?'

'ఏమీలేదు'

'మరి... ఇల్లెలా గడుస్తోంది?'

'ఏముందీ... ఆ రోజుల్లో ఆయన దగ్గర సహాయం పొందినవాళ్ళు ఎవరో ఒకరు అడక్కుండానే ఏదో ఒక రూపంలో సహాయం చేస్తున్నారు.'

'ఎంత చేస్తే మాత్రం... అంత పెద్ద కుటుంబం గడిచేదెట్లా?' ఆశ్చర్యంగా అడిగాను.

'అదే కదా బాబూ! వాళ్ళ బాధలు ఆ భగవంతుడికే తెలుసు. వాళ్ళందరికీ ఆత్మాభిమానం ఎక్కువ. తనకింద పనిచేసిన వాళ్ళ దగ్గర తను పనిచెయ్యలేనని ఆనందరావుగారి బాధ... ఆ పిల్లలు ఆకలికి నీళ్ళు తాగి కడుపు నింపుకుని ఫస్టుగా చదువుతున్నారు. అందరికీ స్కాలర్‌షిప్పులొస్తున్నాయి. ఎవరో ఒకరు పుస్తకాలు ఫ్రీగా ఇప్పిస్తున్నారు.'

అమ్మ చెబుతూ వుంది. నా ఆలోచనలు సుళ్ళు తిరుగుతూ వున్నాయి. 'అమ్మా! పెద్దమ్మాయి పెళ్ళికొస్తోంది. ఇలా అయితే ఎలా?' ఏదో నసిగాను.

'ఆ అమ్మాయి ఆలోచనలు పెళ్ళిమీద లేవు బాబూ. ఇంకొక ఏడాది చదివి, మెట్రిక్ అయ్యాక ఏదో ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాలని ఆమె ఆశయం, ఆందోళన. ఇప్పటికే, స్కూలు టైమ్ అయ్యాక, రెండు మూడు ట్యూషన్లు చెబుతోంది. దాదాపు వంద

రూపాయలు సంపాదిస్తోంది. అందుకే యాభైరూపాయల అద్దెకి ఈ ఇల్లు తీసుకున్నారు' ఇంక చెప్పేమాటలు చెవిన పడడంలేదు. 'అయ్యో ఆడపిల్లా?' అనేవాళ్ళ నోళ్ళకి తాళం వేసింది వర్షిణి. ఆమె ఆశయం, ఆప్యాయతా గొప్పవి. మనసులో అనుకున్నట్టుగా పైకే అనేశాను.

'అవునురా' అంది అమ్మ.

*　　　*　　　*

ఆగర్భ శ్రీమంతురాలూ, ప్రతివారీ ఆకలి తీర్చే సాక్షాత్తూ అన్నపూర్ణమ్మ, ఆ సౌభాగ్యమ్మగారు, పనివాళ్ళకి కూడా నేతిగారెలు వడ్డించడం కళ్ళారా చూసిన నేను, రాజయ్య గారెలకోసం ఇడ్లీలకోసం ప్రాధేయపడడం, పదే పదే జ్ఞాపకం వచ్చి నా గుండె ముక్కలయిపోతోంది. వాళ్ళకెలా సహాయం చెయ్యాలి? ఇవే నా ఆలోచనలు. ఈ ఆలోచనల తోటే వారం రోజులు గడిచిపోయాయి. ఆ రోజు నాకు ఉద్యోగం వచ్చిందని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరు నుంచొచ్చిన టెలిగ్రాం నన్నెంతో ఆనందంలో ముంచెత్తింది. వెంటనే వచ్చి బెంగుళూరులో జాయినవ్వమని వుంది. సరే వెళ్ళిపోయాను. వెళ్ళేముందు వర్షిణి కనిపించలేదు. ఇంటికి వెళ్ళి చెప్పే ధైర్యమూ, చనువూ నాలో లేదు. సరే! వచ్చాక కలుద్దాంలే అని బెంగుళూరు వెళ్ళిపోయాను.

దాదాపు నెలరోజుల తర్వాత తిరిగొచ్చిన నాకు, పెంటయ్య ఇంటికి వేళ్ళాడుతున్న తాళం నన్ను వెక్కిరిస్తూ కనిపించింది. అమ్మచెప్పింది. పెంటయ్య సామాను బయటపడేస్తానని బెదిరిస్తే రాత్రికి రాత్రి వాళ్ళు ఎవరో స్నేహితుల ఇంటికి వెళ్ళిపోయారని! నా మనసు ఉద్రేకంతో ఊగిపోయింది. పెంటయ్యని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. వర్షిణి కుటుంబం ఎక్కడున్నా ఆదుకోవాలన్నంత ఆవేశం ముంచుకొచ్చింది. కానీ ఎలా? ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో నిట్టూర్చాను.

*　　　*　　　*

కాలచక్రంలో మరో పది క్యాలెండర్లు మారాయి. నేనిప్పుడు ఇద్దరు పిల్లల తండ్రిని. మా పెద్దమ్మాయికి వర్షిణి అని పేరు పెట్టాను. ఒకరోజు అమ్మ చెప్పింది. 'ఒరేయ్ శరత్. నీకు తెలుసా? వర్షిణి ఇప్పుడు పెద్ద ఆఫీసరట. అదేదో ఆఫీసు పేరు చెప్పారు. తమ్ముళ్ళందరినీ బాగా చదివించిందట. వాళ్ళందరూ మంచి మంచి ఉద్యోగాలు చేస్తున్నారట. అందరికీ మంచి సంబంధాలొచ్చి పెళ్ళీ పేరంటాలు అన్నీ జరిగాయట. సౌభాగ్యమ్మ సౌభాగ్యం మళ్ళీ తిరిగొచ్చింది' అంది అమ్మ.

ఆ మాటలు నా గుండెలో అమృతవర్షం కురిపించాయి. 'నాకు తెలుసమ్మా వర్షిణి పట్టుదల' అని మాత్రం అన్నాను. వాళ్ళిప్పుడు ఎక్కడున్నారో మళ్ళీ వాళ్ళందరినీ చూడగలుగుతానో లేదో ఆలోచిస్తూ . . . ఎందుకంటే . . . నాకు ఫారిన్ పోస్టింగ్ వచ్చింది.

ఎక్కడున్నా ఎప్పుడైనా వర్షిణి కుటుంబం కళ్ళకి కట్టినట్టే హృదయకవాటంలో స్థిరంగా తిష్ఠ వేసుకునుండటం వల్ల ఎప్పుడూ వాళ్ళు నా దగ్గరున్నట్టే అనిపిస్తుంది. అందుకే ఆ రోజు సౌభాగ్యమ్మగారు వడ్డించిన తీరూ, రాజయ్య టిఫినుకోసం అభ్యర్థించిన తీరూ నాలో చెరగని ముద్రవేసి ఆకలి ఎటువంటిదో, ఆ బాధ ఎటువంటిదో, ఆకలిలోంచి ఎటువంటి నిర్ణయాలు పుడతాయో వర్షిణి కుటుంబం నాకాదర్శంగా వుండి 'ఆకలి' అన్నవాళ్ళకి అన్నంపెట్టేలా చేసింది. 'కోటివిద్యలు కూటి కొరకే'. అయితే, మనం వేసుకునే బాట ఉన్నతమైనది కావాలి. ఆకలిబాధ తాళలేక అనర్థదాయకమైన పన్లు చెయ్యకూడదు. ఆ మాటలే మా చిట్టి వర్షిణికి చెప్తూ వుంటాను ఎప్పుడూ!

(ఈ దేశంలో ఆకలిబాధ పడుతున్న పౌరులందరికీ ఈ నా కథ అంకితం)

* * *